ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా నిలవాలి

- సచివాలయ కన్వీనర్లదే కీలక పాత్ర
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: గ్రామ సచివాలయ కన్వీనర్లుగా నియామకమైన వారు చిత్తశుద్ధిగా పనిచేసి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా నిలబడితే రానున్న ఎన్నికల్లో విజయం మనదేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరులోని కల్యాణ మండపంలో శనివారం సచివాలయ కన్వీనర్లు, గ్రామ సారధులతో మంత్రి కాకాణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో 89 సచివాలయాలు ఉన్నాయని, ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు. వీరు వలంటీర్లతో వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులను పరిశీలించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని పటిష్ట పరచడంతోపాటు ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు కన్వీనర్లు, సారధుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడమే మన ముందున్న కర్తవ్యంగా మంత్రి పేర్కొన్నారు. ఇందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు సచివాలయ కన్వీనర్లు, సారధులు సంసిద్ధంగా ఉండాలన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 1,800 మంది వలంటీర్లు ఉండగా 3,600 మంది సచివాలయ కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యులు ఎస్‌కే షాకీరాబేగం, గుంటి శ్రీనివాసులు, రావుల దశరథరామయ్యగౌడ్, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, నాయకులు పెదమల్లు రమణారెడ్డి, బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హద్దులు దాటితే చర్యలు తప్పవు

తోటపల్లిగూడూరు: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను పురస్కరించుకొని యువతీ యువకులు హద్దులు దాటి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసులు మండల ప్రధాన కేంద్రాల్లో తిరిగి ప్రభుత్వ నిబంధనలను వివరిస్తూ స్థానికులకు హెచ్చరికలను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను మండల వాసులు ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. అలాకాకుండా వేడుకల ముసుగులో నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కోడూరు, కాటేపల్లి బీచ్‌ల సందర్శనకు సంబంధించి నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో మండల వాసులు పోలీస్ సిబ్బందికి సహకరించి నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్సై ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముందుగా శనివారం నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, భగవంతుడు అందరినీ చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరి జీవితంలో చీకట్లు తొలగి వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

సేవలు అమూల్యం



సాయిలక్ష్మి-మురళీకృష్ణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ముత్తుకూరు: సెకండరీ గ్రేడ్ టీచర్‌గా సాయిలక్ష్మి అమూల్యమైన సేవలు అందించారని ఎంఈఓ మధుసూదన్ కొనియాడారు. ముత్తుకూరు పంచాయతీలోని బోడిస్వామికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న సాయిలక్ష్మి శనివారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ అధ్యక్షతన ఉపాధ్యాయులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిలక్ష్మి-మురళీకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. 24 సంవత్సరాలపాటు టీచర్‌గా పనిచేసిన సాయిలక్ష్మి ఎందరో విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దారని సహచర ఉపాధ్యాయులు కొనియాడారు.

నోరూరించిన కేకులు



వివిధ ఆకృతుల్లో తయారు చేసిన కేకులు

పొదలకూరు: నూతన ఆంగ్ల సంవత్సర సంబరాల కోసం శనివారం పట్టణంలోని స్వీట్స్ అండ్ బేకరీ వ్యాపారులు నోరూరించే రంగురంగుల కేకులను సిద్ధం చేసి విక్రయించారు. 2023 జనవరి 1వ తేదీన నూతన ఆంగ్ల సంవత్సర సంబరాల కోసం వివిధ ఆకృతుల్లో ఆర్డర్లపై కేకులను తయారుచేశారు. పిల్లలను రకరకాల ఆకృతుల్లో ఉన్న కేకులు విపరీతంగా ఆకర్షించాయి. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల వారు ముందుగా కేకులకు ఆర్డర్లు ఇచ్చి తయారుచేయించుకున్నారు. యువత అర్ధరాత్రి 12 గంటలకు కేక్‌లు కట్ చేసి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

యూరియా కొరత తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న గోపాల్

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. రైతు సమస్యలపై కలెక్టరేట్ ఎదుట సోమవారం చేపట్టనున్న ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



నెల్లూరు రూరల్: లివర్ కేన్సర్‌తో బాధపడుతూ కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్న 30వ డివిజన్లోని చాణుక్యపురికి చెందిన హబీబ్‌కు రూ.పది వేల ఆర్థిక సాయాన్ని మస్కట్ టీమ్ సహకారంతో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు వేణుగోపాల్, నూర్జహాన్, సుబ్బారావు, రాఘవేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం: అభివృద్ధి విషయంలో బుచ్చిరెడ్డిపాళెంను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీగా ఏర్పడిన తరువాత సంవత్సర కాలంలో ప్రభుత్వం దాదాపు రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో రూ.85 కోట్లతో అమృత్ 2.0 కింద నగర పంచాయతీ ప్రజలకు త్వరలోనే రక్షిత మంచినీటిని అందిస్తామని తెలిపారు. అలాగే నుడా నిధులతో రోడ్లు, పార్కు నిర్మాణం చేశామన్నారు. అంతేకాకుండా నగర పంచాయతీలో రెండు సెంట్రల్ లైటింగ్‌లను మంజూరు చేసుకొని ఒకటి పూర్తి చేయగా, మరో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించామని తెలిపారు. అలాగే మరో రూ.5 కోట్లతో నగర పంచాయతీకి కావాల్సిన వాహనాలను కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దీంతోపాటు ఈ సమావేశంలో సుమారు 31 తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, షేక్ షకీల, నాగరాజు, బిట్రగుంట ప్రమీలమ్మ, రహమత్, మల్లారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ హమీద్

తోటపల్లిగూడూరు: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని తహసీల్దార్ హమీద్ సూచించారు. సివిల్ రైట్స్ డే సందర్భంగా శనివారం మండలంలోని విలుకానుపల్లి పంచాయతీ లక్ష్మీపురంలో చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చట్టం ఎవ్వరి చుట్టం కాదనే విషయం అందరూ గుర్తించుకోవాలని, చట్టాలు పేద, ధనిక తేడాలు చూడవని తెలిపారు. చట్టాలపై అవగాహన లేని కొందరు అట్టడుగువర్గాల వారు తమకు న్యాయం జరగదని అపోహ పడుతుంటారన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా కేసులను వాదించడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై పేద, బడుగు, బలహీనవర్గాల వారు అవగాహన కలిగి ఉండి ఉచిత న్యాయ సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హేమలత, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, ఆర్‌ఐ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించి స్వామివారి నామస్మరణ చేశారు. భక్తులు వెంకటేశ్వరస్వామిని, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

విశేషాలంకారాల్లో రంగడు, వేణుగోపాలుడు





నెల్లూరు(బృందావనం): పగల్‌పత్తు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారు కాళీయమర్దనాలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు తరలివచ్చారు.

- మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు యోగ నరసింహస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు.

నరేష్‌పై కఠిన చర్యలు చేపట్టాలి

నెల్లూరు(అర్బన్): హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. పార్టీ నేత మిడతల రమేష్, రంగనాథ భక్తమండలి కన్వీనర్ రామ్మోహన్‌రావు, రత్నం భవానీ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్య మండలి నూతన కార్యవర్గం ఎన్నిక



నెల్లూరు(వేదాయపాళెం): ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వేణు, శీనయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రజానాట్య మండలి జిల్లా 12వ మహాసభలను సుందరయ్య కాలనీలో శనివారం నిర్వహించారు. తొలుత ప్రజానాట్య మండలి జెండాను సీనియర్ నేత రత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడారు. అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్‌ను మంజూరు చేయాలని కోరారు. అనంతరం 17 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, టీవీ ఆర్టిస్ట్ మురళి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాయిదర్బార్ అద్దాల మందిరంలో పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో విశేష కార్యక్రమాలను ఆదివారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయినాథుడ్ని బెలూన్లతో ప్రత్యేకంగా అలంకరించనున్నారని చెప్పారు. భక్తులు తరలి రావాలని కోరారు.

ఏఆర్టీ కేంద్రంలో తనిఖీ

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఆండాళ్ భాస్కర్ హాస్పిటల్, వూంబ్ ఐవీఎఫ్ సెంటర్, పొగతోటలోని ఏఆర్టీ క్లినిక్‌లను డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డెమో అధికారి శ్రీనివాసరావు, హెచ్ఈ సునీత, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో అధికారులతో కలిసి శనివారం పర్యటించిన ఆమె మాట్లాడారు. లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గృహాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. లేఅవుట్లలో విద్యుత్, వీధిదీపాలు, మంచినీరు, డ్రెయిన్లు, తదితర వసతులను కల్పించాలని చెప్పారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు(అర్బన్): నగరంలోని నజీర్‌తోటలో నివాసం ఉంటున్న నిరుపేద వృద్ధ దంపతులకు బియ్యం బస్తాతో పాటు నిత్యావసర సరుకులను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. కార్యక్రమానికి సహకరించిన మునుస్వామి, అజయ్‌కు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్‌బాబు కృతజ్ఞతలను తెలియజేశారు. సభ్యులు ధనుష్, శశికిరణ్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన రేపు



మాట్లాడుతున్న రషీద్

నెల్లూరు(వేదాయపాళెం): మైనార్టీ విద్యార్థులకు ఇస్తున్న ఉపకార వేతనాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నగరంలో నిరసన ప్రదర్శనను సోమవారం నిర్వహించనున్నామని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న ర్యాలీకి తరలిరావాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హర్ష, శ్రీనివాసులు, ఆవాజ్ నగర కార్యదర్శి రియాజ్, సమీవుల్లా, డీవైఎఫ్ఐ నేత జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అండగా ప్రభుత్వం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారంగా పింఛన్ల నగదును పెంచారు. అందులో భాగంగా నూతన ఆంగ్ల సంవత్సర కానుకగా అర్హులైన పింఛన్‌దారులందరికీ జనవరి ఒకటో తేదీ నుంచి పింఛన్ నగదును రూ.2,500 నుంచి రూ.2,750లకు పెంచి అందించనున్నారు. ఈ మొత్తాన్ని నేటి నుంచి వలంటీర్లు లబ్ధిదారులకు అందజేయనున్నారు. కోవూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లో నూతనంగా 1,682 మందికి పింఛన్లు మంజూరయ్యాయి.

- పెంచిన పింఛన్ నగదు నేటి నుంచి పంపిణీ
- కోవూరు నియోజకవర్గంలో 40 వేల మందికి లబ్ధి
- నూతనంగా 1,682 మందికి పింఛన్లు మంజూరు



ఆస్పత్రిలో ఉన్న పింఛన్‌దారుకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్(ఫైల్)


బుచ్చిరెడ్డిపాళెం: వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నేటి నుంచి పింఛన్ నగదు మొత్తాన్ని పెంచి అందించనున్నారు. పెంచిన రూ.250లతో కలిపి మొత్తం రూ.2,750లను లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. ఈ మొత్తాన్ని వలంటీర్ల ద్వారా నూతన ఆంగ్ల సంవత్సర కానుకగా అర్హులకు అందించనున్నారు. ఇప్పటికే కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, ఇందుకూరుపేట, విడవలూరు, కోవూరు మండలాల్లో సుమారు 40,525 మందికి ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్నారు.

నూతనంగా 1,682 మందికి పింఛన్లు

రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారులకు పెంచిన పింఛన్ నగదును జనవరి ఒకటో తేదీ నుంచి అందించనున్నారు. కోవూరు నియోజకవర్గంలో మరో 1,682 మందిని నూతనంగా పింఛన్ పొందేందుకు అర్హులని గుర్తించారు. వీరికి కూడా నేటి నుంచి రూ.2,750 వలంటీర్ల ద్వారా అందించనున్నారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను గుర్తించారు. పింఛన్లు రద్దు చేస్తున్నారని ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తుండగా అసలు రద్దు చేయడం దేవుడెరుగు నూతనంగా 1,682 మందికి పింఛన్లు ఇస్తున్న విషయాన్ని ప్రతిపక్షాలు తెలుసుకోవాల్సిఉంది. ఎక్కడా ఒక్క పింఛన్‌ను కూడా రద్దు చేయడం లేదని అధికారులు దీనిపై స్పష్టత ఇచ్చారు.

మండలం	పాత పింఛన్లు	కొత్తగా మంజూరైన పింఛన్లు
బుచ్చిరెడ్డిపాళెం	9207	484
విడవలూరు	7369	254
కొడవలూరు	6460	240
ఇందుకూరుపేట	8487	304
కోవూరు	9002	400

అర్హతను బట్టి ఎంపిక



అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ పింఛన్ అందించేందుకు ఎంపిక చేశాం. పాత ఫించన్‌దారులతోపాటు నూతనంగా గుర్తించిన అర్హులకు కూడా నేటి నుంచి రూ.2,750 పింఛన్ నగదు అందిస్తాం. ఇందుకు సంబంధించి ఇప్పటికే వలంటీర్లకు తగు సూచనలు ఇచ్చాం. ఎవరి పింఛన్లు తొలగించలేదు. పైగా కొత్త పింఛన్‌దారులను గుర్తించి వారికి కూడా పింఛన్లు ఇస్తున్నాం.

– నరసింహారావు, ఎంపీడీఓ, బుచ్చిరెడ్డిపాళెం

నేడు సరస్వతినగర్‌కు మంత్రి కాకాణి రాక

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని సరస్వతినగర్‌కు ఆదివారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య శనివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సరస్వతినగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో జరిగే కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పెన్షన్ల నగదును లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



పొదలకూరు: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌తోపాటు సీఎల్ బుక్, వాల్ క్యాలెండర్, పాచ్‌లను స్థానిక ఎమ్మార్సీ భవన్ వద్ద ఎంఈఓ సుధీర్‌బాబు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడికి ఏపీటీఎఫ్ అందించిన మెటీరియల్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఏఎంఓగా బదిలీపై వెళుతున్న ఎంఈఓను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.









దేశంలోనే ఆదర్శవంతమైన పాలన

- దేశవ్యాప్తంగా 'నాడు–నేడు' పథకం అమలు చేసే యోచన
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న పాలన భారతదేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తోందని, రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఆచరణలో పెట్టే యోచనలో కేంద్రం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరులోని డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో మండలంలోని 8వ తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను శనివారం మంత్రి కాకాణి పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు అందించిన ఒక్కొక్క ట్యాబ్ విలువ బైజూస్ కంటెంట్‌తో కలిపి రూ.32,888 కాగా, రాష్ట్రవ్యాప్తంగా 5,10,000 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 24,384 మందికి రూ.78.20 కోట్లతో, సర్వేపల్లి నియోజకవర్గంలో 3,130 మందికి రూ.10 కోట్లతో, పొదలకూరు మండలంలో 760 మందికి రూ.2.44 కోట్లతో ట్యాబ్‌లు అందజేసినట్లు తెలిపారు. తాను చదువుకుని, ఆటలాడిన పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తానని అనుకోలేదని మంత్రి కాకాణి భావోద్వేగానికి గురయ్యారు.



విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు

మంత్రి కాకాణి విద్యార్థుల మధ్య ముందస్తుగా నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. 2023 నూతన ఆంగ్ల సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని, విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఎంఈఓ సుధీర్ బాబు, హెచ్‌ఎంలు సనత్‌కుమార్, పెర్సిస్, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎస్‌కే షాకీరాబేగం, రావుల దశరథరామయ్యగౌడ్, జి.శ్రీనివాసులు, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెంలో యూపీ స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను శనివారం పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి చేతులమీదుగా హెచ్‌ఎం కృష్ణమోహన్ ఈ ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు ప్రభాకరనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో..

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో శనివారం 78 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగాహాజరై విద్యార్థులకు ట్యా బ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌ఎం సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట

బుచ్చిరెడ్డిపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారని రేబాల సర్పంచ్ లంగుతోటి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రేబాల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సుమారు 61 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను శనివారం ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, హరిప్రసాద్‌రెడ్డి, మస్తానయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పొదలకూరు: విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న సొసైటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి



ముత్తుకూరు: ట్యాబ్‌లు అందుకున్న పంటపాళెం యూపీ స్కూల్ విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం: రేబాల ఉన్నత పాఠశాలలో..









రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ముదివర్తిపాళెం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ

ఇందుకూరుపేట: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎ.సదానందరావు తెలిపారు. జూనియర్స్ విభాగంలో 8వ తరగతికి చెందిన సీహెచ్ దీక్షిత, వై.వెంకటస్రవంతి, 7వ తరగతికి చెందిన వై.హర్షవర్ధన్, సీనియర్ విభాగంలో 9వ తరగతికి చెందిన ఎన్.భవాని, స్టాండ్‌బైగా ఎం.అక్షయ ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతోపాటు పీడీ హరయ్యను ఈ సందర్భంగా శనివారం ఆ పాఠశాలలో హెచ్‌ఎం అభినందించారు.

అగ్గిపెట్టెలో ఆంగ్ల సంవత్సర క్యాలెండర్

మనుబోలు: అగ్గిపెట్టెలో పట్టే పరిమాణంలో నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను సూక్ష్మకళాకారుడు ఆలూరు రాము తయారు చేసి అందరినీ అబ్బురపరిచారు. తిథి, వార నక్షత్రాలతో కూడిన 2023 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను శనివారం గ్రామస్తుల ఎదుట ప్రదర్శించారు. మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన ఆలూరు రాము వృత్తి రీత్యా వడ్రంగి. ఖాళీ సమయాల్లో తనలోని సృజనాత్మకతకు పదును పెడుతూ పలు రకాల సూక్ష్మకళారూపాలను తయారు చేస్తుంటారు. రాము తయారు చేసిన పలు సూక్ష్మరూపాలు రాష్ట్రస్థాయిలో ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. రాము ప్రతిభను పలువురు కొనియాడుతున్నారు.



సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము



అగ్గిపెట్టెలో పట్టే క్యాలెండర్

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు ముందుగా భక్తిశ్రద్ధలతో మెట్లపూజ నిర్వహించి గ్రామోత్సవం ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది.









